ప్రజా శాంతికి భంగం కలిగించొద్దు

ఎస్పీ పారితోష్ పంకజ్

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ పారితోష్ పంకజ్

జిన్నారం, ఏప్రిల్ 29 : ప్రజాశాంతికి భంగం కలిగించేలా వ్యవహరించొద్దని ఎస్పీ పారితోష్ పంకజ్ అన్నారు. ఇటీవల జిన్నారం గ్రామ శివారులోని తాంబేలు గుట్ట వద్ద బండరాయిపై ఏర్పాటు చేసిన శివుడి విగ్రహాన్ని కోతులు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై మండలంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితుల వల్ల ఇరు మతాల మధ్య శాంతిని నెలకొల్పాలనే ఉద్దేశంతో మంగళవారం జిన్నారం మండల కేంద్ర శివారులోని ఎస్ఎన్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్పీ పారితోష్ పంకజ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు కృషి చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి సంఘటనలు ఎదురైనా వెంటనే సమీప పోలీస్‌స్టేషన్లో లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. వివిధ కుల మతాలకు చెందిన పవిత్ర స్థలాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయా మత సంఘాల పెద్దలకు ఎస్పీ సూచించారు. వీటి ద్వారా నేరాలను నియంత్రించడంతో పాటు జరిగిన నేరాలను నివృత్తి చేసే అవకాశం ఉందన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ సంజీవ రావు, పటాన్ చెరు వు డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐలు నయీముద్దీన్, రవీందర్ రెడ్డి, వినాయక్ రెడ్డి, ఎస్సైలు నాగలక్ష్మి, సుభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

హాజరైన హిందూ, ముస్లిం సంఘాల ప్రతినిధులు

84వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

నల్లవల్లిలో రిలే నిరాహారదీక్ష చేస్తున్న రైతు జేఏసీ నాయకులు, మహిళలు

గుమ్మడిదల, ఏప్రిల్ 29 : ప్యారానగర్ డంపింగ్‌యార్డు (ఎంఎస్‌డబ్ల్యూ)పై రాష్ట్ర ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోదా..? సర్కారుపై నిరసనలు కొనసాగాల్సిందేనా..? అంటూ ఆందోళనకారులు ప్రశ్నిస్తున్నారు. గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ సమీపంలో జీహెచ్ఎంసీచే ఏర్పాటు కాబోతున్న డంపింగ్‌యార్డు (ఎంఎస్‌డబ్ల్యూ)కు ఇచ్చిన అనుమతులు రద్దు చేయండి.. ఇటీవల ప్రజాభిప్రాయసేకరణలో నూటికి నూరుశాతం ప్రజలు డంపింగ్‌యార్డు వద్దని తమ అభిప్రాయాలు తెలియజేసినా సర్కారు జా ప్యం ఎందుకు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలనలో ప్రజల అభిప్రాయాలు పట్టవా.. సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోరా..? అంటూ ప్యారానగర్, నల్లవల్లిలో గ్రామాల్లో మంగళవారం 84వ రోజు కొనసాగిస్తున్న రిలే నిరాహారదీక్షలు ఆందోళన కారులు సర్కారు ప్రశ్నించారు. ఇప్పటికైనా గుమ్మడిదల చుట్టు గ్రామాల ప్రజలు మనోవేదనను అర్థం చేసుకొని డంపింగ్‌యార్డును రద్దు చేయాలని సర్కార్‌ను వేడుకున్నారు. రైతు జేఏసీ నాయకులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

లీ ఫార్మా కంపెనీపై గ్రామస్తుల ఫిర్యాదు

పీసీబీ అధికారి కుమార్ పాఠక్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

జిన్నారం, ఏప్రిల్ 29 : మండల పరిధిలోని గడ్డపోతారం పారిశ్రామికవాడలోని లీఫార్మా పరిశ్రమ నుంచి వెలువడుతున్న వాయు కాలుష్యం నుంచి స్థానిక ప్రజలను కాపాడాలని గడ్డపోతారం, చెట్ల పోతారం గ్రామస్తులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం పీసీబీ ఈఈ కుమార్ పాఠక్‌ను కలిసి ఇరుగ్రామస్తులు వినతి పత్రాన్ని అందజేశారు. పరిశ్రమ నుంచి సాయంత్రం వేళల్లో యథేచ్ఛగా విషవాయువులను వాతావరణంలోకి విడుదల చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. పరిశ్రమ నిర్వాకంపై పలుమార్లు ఫిర్యాదు చేసినా కూడా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు నారబోయిన శ్రీనివాస్, బాలయ్య, సత్యనారాయణ, తదితరులు కోరారు.

కొవ్వొత్తుల ర్యాలీ

జహీరాబాద్‌లో కొవ్వొత్తులతో ర్యాలీని నిర్వహిస్తున్న ముస్లిం యాక్షన్ కమిటీ నాయకులు

కంది, ఏప్రిల్ 29 : పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్లు,విద్యార్థులు ఖండించారు. ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి సంఘీభావంగా ఐఐటీహెచ్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులకు వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో..

జహీరాబాద్, ఏప్రిల్ 29 : పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య అని జహీరాబాద్ ముస్లిం యాక్షన్ కమిటీ సభ్యులు అన్నారు. మంగళవారం రాత్రి జహీరాబాద్ పట్టణంలోని ప్రధాన రోడ్డు మార్గం గుండా కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించి నివాళులర్పించారు.

ఐఐటీహెచ్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఐఐటీహెచ్ డైరెక్టర్ మూర్తి,తదితరులు

కేసుల పరిష్కారానికి చొరవ చూపాలి

మాట్లాడుతున్న న్యాయమూర్తి సాయిరమాదేవి

సిద్దిపేట టౌన్,ఏప్రిల్ 29 : జాతీయ లోక్ అదాలత్‌లో అధికశాతం కేసుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి సూచించారు. మంగళవారం జూన్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని పోలీస్,ఎక్సైజ్ ,రెవెన్యూ అధికారులతో కోర్టు సమావేశం మందిరంలో సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో క్రిమినల్, సివిల్ ఎక్సైజ్, మోటర్ వాహన కేసులు అధిక మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటి పరిష్కారానికి జూన్ 9 నుండి 14 వరకు స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు.అన్ని రకాల కేసులు రాజీపడేటట్లు ఆయాశాఖల అధికారులు సమిష్టిగా కృషిచేయాలని కోరారు. జడ్జిలు జయప్రసాద్, కాంబ్లె, సంతోష్‌కుమార్, తరణి, కాంతారావు, నాగరాజు అమ్మ పీపీ జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అండగా 'భూ భారతి'

కలెక్టర్ వల్లూరు క్రాంతి

అందోల్: జోగిపేటలో మాట్లాడుతున్న కలెక్టర్

అందోల్, ఏప్రిల్ 29 : భూభారతి రైతులకు ఎంతో అండగా ఉంటుందని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. మంగళవారం జోగిపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో భూ భారతిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ భారతి చట్టం రైతుల సమస్యలను తీర్చే ఆయుధంలా పనిచేస్తుందన్నారు. భూ భారతిపై అవగాహన కోసం రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు మండలాలను పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకొని సదస్సులు నిర్వహించి, రైతుల సూచనలు.. సలహాలు తీసుకుంటామని తెలిపారు. వారి నుంచి తీసుకున్న సూచనలను భూ భారతిలో పొందుపర్చుతారని, రైతులు తప్పనిసరిగా వారి సూచనలు, సలహాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీవో పాండు, స్టేట్ మార్కుఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్, ఏప్రిల్ 29 : భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి చట్టమని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. మంగళవారం నారాయణఖేడ్‌లోని సాయి బాబా ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన సదస్సుకు కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టంతో రైతులకు మేలు చేకూరుతుందన్నారు. భూ సమస్యలను పరిష్కరించే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఆర్డీవో అశోక చక్రవర్తి పాల్గొన్నారు.

వట్‌పల్లిలో..

వట్‌పల్లి, ఏప్రిల్ 29 : భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. వట్‌పల్లి మండలంలోని సద్గురు కృప ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన భూభారతి అవగహన సదస్సులో కలెక్టర్, అదనపు కలెక్టర్ గీతమాధురి పాల్గొన్నారు. గ్రామాల్లోని ప్రజలకు చట్టంపై సందేహాలను నివృత్తి చేస్తామన్నారు. ఆర్డీవో పాండు, ఏఎం సీ చైర్మన్ కొప్పుల లక్ష్మీశేఖరెడ్డి, అత్మకమిటీ చై ర్మన్ కచూర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

ఇండ్ల సర్వేను సమర్థవంతంగా చేపట్టాలి

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

రాఘవపూర్‌లో సర్వే తీరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

జహీరాబాద్/ఝరాసంగం, ఏప్రిల్ 28 : ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ప్రక్రియను అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం న్యాల్‌కల్ మండలంలోని రాఘవపూర్, మండల కేంద్రమైన ఝరాసంగం, ఎల్గోయి గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే తీరును పరిశీలించారు. ఈ నెల 30 లోపు అర్హుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అనంతరం న్యాల్‌కల్ మండలంలోని రాఘవపూర్ గ్రామ శివారులోని మిషన్ భగీరథ తాగునీటి సరఫరా చేసే సంప్ హౌజ్‌ను సందర్శించారు. మండల కేంద్రమైన ఝరాసంగం, ఎల్గోయి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద కూలీలను చేపడుతున్న పనులను పరిశీలించారు. ఆయన వెంట ఆయా మండలాల తహసీల్దార్లు భూపాల్, డిప్యూటీ తహసీల్దార్లు రాజిరెడ్డి, ఎంపీడీవో రాజశేఖర్, సుధాకర్, ఏపీవోలు రాజ్‌కుమార్, రంగారావు తదితరులు ఉన్నారు.

ఉద్యోగులపై కేసులు ఎత్తివేయాలి

ఎస్పీ పారితోష్ పంకజ్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్

జిన్నారం, ఏప్రిల్ 29 : జిన్నారం గ్రామానికి చెందిన పలువురు ఉద్యోగులపై నమోదైన కేసులను ఎత్తివేయాలని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎస్పీ పారితోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ సంజీవరావులకు వినతి పత్రాన్ని అందజేశారు. మాజీ సర్పంచ్‌లు ఆంజనేయులు, జనార్దన్, నాయకులు ఉన్నారు.

కవి మొగిలిమాలకు ఘన సన్మానం

రవీంద్ర భారతిలో సన్మానిస్తున్న ప్రముఖులు

జిన్నారం, ఏప్రిల్ 29 : మండల పరిధిలోని కొడకంచి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కవి మొగిలి మాలను కరీంనగర్‌కు చెందిన మహతి సాహితీ కవి సంగమం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖ కవి రంగస్థలం నటుడు సాధనాల వెంకటరామి నాయుడు బంగారు నంది అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. రాష్ట్రస్థాయిలోని ప్ర ముఖుల చేతుల మీదుగా అవార్డును అందుకోవడం పట్ల కవి మొగిలి మాల సంతోషం వ్యక్తం చేశారు.

మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

తనిఖీ చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో గాయత్రి దేవి

మునిపల్లి, ఏప్రిల్ 29 : మండల కేంద్రమైన మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం వైద్యాధికారి డాక్టర్ గాయత్రిదేవి ఆకస్మిక తనిఖీ చేశారు. దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు. ఆమె వెంట డాక్టర్ రవి, సూపర్ వైజర్ విజయలక్ష్మి, పీహెచ్ఎన్ చంద్రభాను తదితరులు ఉన్నారు.

పుస్తెలతాడు అపహరణ

కొమురవెల్లి, ఏప్రిల్ 29 : గుర్తుతెలియని వ్యక్తులు మహిళ నుంచి నుంచి పుస్తెలతాడు అపహరించిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వనపర్తి భాగ్యమ్మ మంగళవారం వేకువజామున నాలుగు గంటలకు రోజుమాదిరిగా గుడి ముందు దండం పెట్టుకొని దుకాణం తీస్తున్న సమయంలో వెనుక నుంచి గుర్తు తెలియని వ్యక్తి ఆమెను వంచి ఐదు తు లాల బంగారు పుస్తెలతాడు ఎత్తుకెళ్లాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొమురవెల్లి ఎస్సై రాజు కేసు నమోదు చేశాడు. ఘటనా స్థలాన్ని సీఐ శ్రీను పరిశీలించారు.

ఆపదలో ఉన్న కార్యకర్తకు రక్తమిచ్చిన నాగరాజు

కనకయ్యకు రక్తదానం చేస్తున్న నాగరాజు

వర్గల్,ఏప్రిల్ 29: మండలంలోని తున్కి మక్తాల గ్రామానికి చెందిన సాకలి కనకయ్య ఈనెల 27న వరంగల్ జిల్లాలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్లి తిరిగివస్తున్న క్రమంలో రోడ్డుప్రమాదానికి గురయ్యాడు. కనకయ్య ఆరోగ్యపరిస్థితి విషమించడంతో ఆయన కుటుంబసభ్యులు సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. కనకయ్యకు అక్కడి వైద్యులు రక్తం అత్యవసరం ఉందని తెలుపగా మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సూచనల మేరకు మంగళవారం మధ్యాహ్నం వర్గల్ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా యూత్ అధ్యక్షుడు దేవగణిక నాగరాజు గాంధీ దవాఖానకు వెళ్లి రక్తదానం చేశారు.

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

సందిల బలరాం

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 29 : గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సందిల బలరామ్ మంగళవారం డిమాండ్ చేశారు. ఏడాదిన్నర కాలం నుంచి గ్రామాల్లో సర్పంచ్‌లు లేనప్పటికీ పంచాయతీ కార్యదర్శులు అన్నీ తామై నడిపిస్తూ గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నారని పేర్కొన్నారు. ఇటీవల సీఎం పంచాయతీ రాజ్ అధికారుల సమీక్షలో మాట్లాడుతూ చెత్త సేకరణ కోసం కొత్త యాప్‌ను తీసుకొస్తామని చెప్పారని గుర్తు చేశారు. అయితే చెత్త సేకరించే ట్రాక్టర్లను నడపడానికి డీజిల్‌కు కూడా నిధులు లేని పరిస్థితుల్లో ఎలా సాధ్యమవుతుందో అధికారులే చెప్పాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, ఏప్రిల్ 29 : రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. బసవ జయంతి పర్యదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రీయ బసవ దళ్ అధ్యక్షుడు శంకర్‌పాటిల్ ఆధ్వర్యంలో మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని బసవ మండపంలో ఏర్పాటు చేసిన రక్తదానం, ఉచిత వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బసవ జయంతి పర్యదినాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం రక్తదానం, ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం రక్తదానం చేసిన దాతలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఆంతకు ముందు బసవ మండపంలో బసవేశ్వరుడి విగ్రహానికి ప్రత్యే క పూజలు చేసి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ బసవ దళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌పాటిల్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తుట్టు నారాయణ, వెంకటేశం, అశోక్‌షేరి, నామరవికిరణ్, మోహీజొద్దీన్, బండిమోహన్, పద్మజ, తులసిదాస్‌గుప్తా, సందీప్‌రాజ్, నగేశ్, బసవదళ్ నాయకులు శరణప్ప, వైద్యాధికారులు పాల్గొన్నారు.

భెల్‌లో క్రీడా పోటీలు

భెల్‌లో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఈడీ కేబీరాజా

రామచంద్రాపురం, ఏప్రిల్ 29 : కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని బీహెచ్ఈఎల్‌లో కార్మికులకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. మంగళవారం భెల్ ఈడీ కేబీరాజా క్రీడా పోటీల్లో పాల్గొని ప్రారంభించిన అనంతరం ఆయన క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక ధృఢత్వం పెంపొందుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడలకు కొంత సమయం కేటాయించాలని సూచించారు. కార్మికుల దినోత్సవం సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జీఎంలు, ఏజీఎంలు తదితరులు పాల్గొన్నారు.

వర్ష బీభత్సం

చాల్కి చౌరస్తాలో కురుస్తున్న వడగండ్ల వర్షం

జహీరాబాద్, ఏప్రిల్ 29 : న్యాల్‌కల్ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం వర్ష బీభత్సం సృష్టించింది. ఉదులు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వడగండ్ల వర్షం కురిసింది. మండలంలోని రాఘవపూర్, చాల్కి, కాకిజనవాడ, అమీరాబాద్, హుమ్నపూర్ తదితర గ్రామాల్లో గాలికి ఇండ్లపై రేకులు కొట్టుకొని పోగా, రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లు, విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. సాగులో ఉన్న జొన్న, ఉల్లిగడ్డ, కూరగాయాల పంటలు వడగండ్లకు దెబ్బతిని తీరని నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు.

చీకూర్తి గ్రామ సమీపంలో కూలిన భారీ చెట్టుతో స్తంభించిన రాకపోకలు, విరిగిన విద్యుత్ స్తంభం

రిసోర్స్ పర్సన్లకు ఇంటర్వ్యూలు

రిసోర్స్ పర్సన్లకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న కమిటీ

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 29 : జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు జిల్లా సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్ల ఎంపిక కోసం మంగళవారం నిర్వహించిన ఇంటర్వ్యూకు 53 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ వేసవి సెలవుల్లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు విద్యా సంబంధిత విషయాలపై, ప్రధానోపాధ్యాయులకు పాఠశాల నిర్వహణ సంబంధిత విషయాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందు కోసం జిల్లాలోని ఆసక్తి గల ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఎంపిక చేయనున్న ఉపాధ్యాయులకు సబ్జెక్టుల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హడ్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్‌రెడ్డి, లెక్చరర్ విజయలక్ష్మి, ఏఎంవో బాలయ్య, సీఎంవో వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఎర్లీ బర్డ్ స్కీమ్

జిన్నారం, ఏప్రిల్ 29 : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.13.36 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేయాల్సి ఉండగా, నేటి వరకు రూ. 5.70 కోట్ల పన్ను ఎర్లీ బర్డ్ స్కీమ్ ద్వారా వసూలు చేశామని కమిషనర్ మధుసూదన్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఆస్తి పన్ను వసూళ్లలో దాదాపు 42 శాతం వసూలు చేసి రాష్ట్రంలో ద్వితీయ స్థానం, జిల్లాలో ప్రథమ స్థానంలో మున్సిపాలిటీ నిలిచిందని పేర్కొన్నారు. నేటితో ముగియనున్న ఎర్లీ బర్డ్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ ఆర్వో నర్సింహులు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

స్వప్న (ఫైల్)

జహీరాబాద్, ఏప్రిల్ 29 : జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డిపల్లికి చెందిన ఓ యువతి అదృశ్యమైంది. ఎస్సై కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాగారెడ్డిపల్లికి చెందిన ధ్యరంగుల స్వప్న (20) ఈ నెల 25న పట్టణంలోని భవానీ మందిరం రోడ్డు మార్గంలోని అశ్వినీ టైలరింగ్‌లో టైలరింగ్ నేర్చుకునేందుకు వెళ్లింది. తిరిగి సాయంత్రం ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పరిసరా ప్రాంతాల్లో వెతికినా ఆ చూకీ లభించలేదు. మంగళవారం కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

మేడే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రామచంద్రాపురం, ఏప్రిల్ 29 : మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు రెడ్ కార్పెట్ పరుస్తున్నది.. కానీ, పేద ప్రజలకు ఒరగబెట్టింది ఏమిలేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్ అన్నారు. మంగళవారం భెల్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో మేడే వాల్ పోస్టర్‌ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అమరవీరుల స్ఫూర్తితో కార్మికులందరూ ఘనంగా మేడే ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు ప్రవీణ్, రవి, భగత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కోహీర్‌లో శాంసన్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

కోహీర్, ఏప్రిల్ 29 : కోహీర్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యకర్త శాంసన్‌ను ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పరామర్శించారు. ఇటీవల ప్రమాదవశాత్తు పశుగ్రాసం కోత యంత్రంలో అతడి చేతి వేళ్లు విరిగిపోయాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గృహానికి వెళ్లి పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని హామీనిచ్చారు. ఎమ్మెల్యే వెంట మండల అధ్యక్షుడు నర్సింహులు, ఖలీం, తదితరులు ఉన్నారు.

ఆర్ఐ, డిప్యూటీ తహసీల్దార్ల సస్పెన్షన్

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 29 : విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన రెవెన్యూ అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. తప్పుడు వారసత్వ ధ్రువీకరణ పత్రం జారీ చేసిన ఆర్ఐ, డిప్యూటీ తహసీల్దార్లను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా తప్పుడు వారసత్వ ధ్రువీకరణ పత్రం మంజూరు చేసినందుకు గతంలో జహీరాబాద్ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసి ప్రస్తుతం కల్టేర్ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న బీటీ పవన్ కుమార్, ఆర్ఐ యాదిలాల్‌లను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జహీరాబాద్ మండలానికి చెందిన షేక్ అహ్మద్ తండ్రి బాసిత్ అహ్మద్ బతికే ఉన్నప్పటికీ అతను చనిపోయినట్లు అతని కోడలు బిపాషాకు వారసత్వ ధ్రువీకరణ పత్రం ఆర్ఐ యాదిలాల్ ఇచ్చిన పంచనామా నివేదిక మేరకు డిప్యూటీ తహసీల్దార్ వారసత్వ ధ్రువీకరణ పత్రం మంజూరు చేశారన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించకుండానే బతికి ఉన్న వ్యక్తి చనిపోయినట్లు పంచనామా నివేదిక సమర్పించారని పేర్కొన్నారు. తప్పుడ